

23న కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలో అర్హులైన వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఈ నెల 23వ తేదీన పంపిణీ చేస్తామని ఎంపిడిఒ లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం కాకినాడకు చెందిన ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కృత్రిమ అవయవాలు (కాళ్లు, చేతులు), మూడు చక్రాల కుర్చీ సైకిళ్లు ఉచితంగా అందజేస్తామని అన్నారు. మండలంలోని అర్హులైన వికలాంగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, మూడు ఫోటోలు తీసుకుని ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

పూర్తయ్యేదెప్పుడో..?

- నత్తనడకన నగర పాలక సంస్థ కార్యాలయ నిర్మాణం పనులు
- మూడేళ్లుగా సాగుతున్న పనులు
- వేధిస్తున్న నిధుల కొరత
- పట్టించుకోని పాలకులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం నిర్మాణ పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. నిధుల కొరత వేధిస్తున్న నేపథ్యంలో ఈ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నగర ప్రజలు స్మార్ట్ సిటీ కార్యాలయంలోని వివిధ విభాగాలకు వెళ్లి పనులు చేయించుకోవాలంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్యాలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిస్థాయిలో నిధులను వెచ్చించాల్సిన అవసరం ఉంది.

31.69 చ.కిమీ. (50 డివిజన్లు) గా విస్తరించి ఉన్న కాకినాడ స్మార్ట్ సిటీలో సుమారు 4 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రణాళికబద్ధంగా నిర్మించిన నగరంగా, పింఛనుదారుల స్వర్గధామంగా కాకినాడకు పేరుంది. ప్రస్తుతం కమిషనర్, అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ విభాగాలను కొండయ్యపాలెం శారదమ్మగుడి వద్ద గల శ్రీశ్రీ భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాలను బీడీలపాక బాల భవన్‌లో ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగాన్ని విక్టోరియా వాటర్ వర్క్స్ మండలంలోని స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన కార్యాలయాన్ని పాత మున్సిపల్ కార్యాలయ సముదాయంలోని కమర్షియల్ కాంప్లెక్స్‌లో పై అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. ఇలా గత మూడేళ్లుగా వివిధ ప్రాంతాలలో నగరపాలక సంస్థ కార్యాలయ విభాగాలను నిర్వహిస్తుండడంతో ప్రజలు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారు. ఏ పని కావాలన్నా ఎక్కడికి వెళ్లి చేయించుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే ఆయా కార్యాలయాలకు వెళుతున్నప్పటికీ ఎక్కువ సార్లు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో పదేపదే కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్నిచోట్ల అయితే సమాధానం చెప్పే నాథులు కరువవుతున్నారు. ప్రధానంగా అనేకమంది పేదలకు పింఛన్ సమస్యలు నగరంలో ఎక్కువగా ఉన్నాయి. అలాగే ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. భవన నిర్మాణాల అనుమతుల కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. స్థలాల ఆక్రమణలు, ఇతర సమస్యలపై వెళుతున్న వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని విభాగాలు ఒకే చోట ఉంటే ప్రజలకు అవస్థలు తప్పే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆయా విభాగాలు వేరువేరు ప్రాంతాలలో ఉండటంతో నగరవాసుల ఇబ్బందులు వర్ణనాతీతం.

వేధిస్తున్న నిధుల కొరత

నగర పరిధిలోని సినిమారోడ్‌లో పాత కార్యాలయం వద్ద నిర్మిస్తున్న నూతన భవన పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. 2022లోనే పనులు మొదలు పెట్టినా నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్నాయి. సాధారణ నిధుల రూ.38 కోట్లతో జి ప్లస్ 3 విధానంలో పనులు నిర్వహిస్తున్నారు. ఆ నిధులు సరిపోకపోవడంతో రూ.20 కోట్లు నగరపాలక సంస్థ నిధులను ప్రతిపాదించారు. అయితే పన్నుల రూపంలో ఏటా సుమారు రూ.77 కోట్లు వసూలవుతున్నప్పటికీ కార్పొరేషన్‌కు సొంత భవనాన్ని రూపొందించుకోలేకపోతుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత ప్రభుత్వ పూర్తి నిర్లక్ష్యం వల్లనే ప్రస్తుతం ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. అయితే తక్షణమే పూర్తిస్థాయిలో నిధులను కేటాయించి పనులను పూర్తి చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ వెంకటరావు, డిఎంహెచ్‌ఒ నరసింహనాయక్

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా జరగనున్న పల్స్ పోలియోను వియవంతం చేయాలని డిఆర్‌ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పల్స్‌పోలియో నిర్వాహణపై సమన్వయ సమావేశం జరిగింది. తొలుత డిఎంహెచ్‌ఒ జె.నరసింహనాయక్ పల్స్ పోలియో కార్యక్రమం సజావుగా జరిగేందుకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలను అధికారులకు వివరించారు. అనంతరం డిఆర్‌ఒ మాట్లాడుతూ పోలియోను అంతమొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. పోలియో బూతులతో పాటు, సోమ, మంగళ రెండు రోజుల పాటు ప్రతి ఇంటిని విజిట్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 0-5 సంవత్సరాలలోపు ఉన్న సుమారు 1.94 లక్షల చిన్నారుల కోసం 1,332 పోలియో బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 61 మొబైల్ టీమ్స్ అందుబాటులో ఉంచడం జరిగిందని, 130 రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో సజావుగా జరిగేందుకు వైద్య ఆరోగ్యశాఖ నుంచి 1,302 పారామెడికల్ స్టాఫ్, 1442 మంది ఆశా వర్కర్లను, 1968 మంది అంగన్‌వాడీ సిబ్బందిని, 656 మంది ఉపాధ్యాయులు, నర్సింగ్ స్టూడెంట్స్, ఇతర వాలంటీర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాలు, నూతనంగా ఏర్పడిన హౌసింగ్ కాలనీలు, మత్స్యకార ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీస్ శాఖ ద్వారా పోలియో బూత్‌ల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పాఠశాల విద్యార్థులతో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతరం పల్స్ పోలియో కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డబ్ల్యూహెచ్‌ఒ ఎస్‌ఎంఒ జాన్ జుబే జాషువా, ఎస్‌బి డిఎస్‌పి సత్యనారాయణ, డిఐఒ సుబ్బరాజు, ఐసిడిఎస్ పీడీ సిహెచ్.లక్ష్మీ, ఎంహెచ్‌ఒ పృథ్వీచరణ్, సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్‌పై కొరడా

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం వద్ద హైవే పక్కన వేస్తున్న అనధికార లే అవుట్‌పై అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. గత సోమవారం అనధికార లే అవుట్, పట్టించుకోని అధికారులు అనే శీర్షికన ప్రజాశక్తి ప్రత్యేక కథనాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణమూర్తి స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రాగాలుకు ఇచ్చిన ఆదేశాలతో బుధవారం అనధికార లే అవుట్‌ను పంచాయతీ సిబ్బంది సందర్శించారు. లే అవుట్‌లో ప్లాట్ల విభజనకు వేసిన రాళ్లను తొలగించారు. కుడా అనుమతులు తీసుకున్న తర్వాతే లే అవుట్‌ను వేయాలని, అప్పటి వరకూ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని సంబంధిత అనధికార లే అవుట్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.



లే అవుట్‌లో వేసిన రాళ్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో ఉన్న సబ్ జైలును బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి ఎం.శ్రీలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముద్దాయిలకు పెట్టే ఆహార పదార్థాలు, తాగునీటిని పరిశీలించారు.



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీలక్ష్మి

అలాగే సబ్ జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ రమణబాబు, న్యాయవాది ప్రభూజీ, పారా లీగల్ వాలంటీర్ కె.జ్యోతి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మండల స్థాయి సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - గొల్లప్రోలు, తాళ్లరేవు

గొల్లప్రోలులోని జడ్‌పి బాలుర హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఏడు టీమ్స్ పాల్గొన్నాయి. సోలార్, సెన్సార్, వాటర్ ఫిల్లింగ్, గ్రీన్ టీ, వేస్ట్ మెటీరియల్, హెల్దీ ప్లాంట్ వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు వెన్న శ్రీనివాస్, బి.శివప్రసాద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, సూర్యప్రకాష్‌రెడ్డి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తాళ్లరేవు మండలంలోని చొల్లంగి జడ్‌పి హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని 14 హైస్కూల్స్ నుంచి విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సెన్సార్ ఆధారంగా కాలింగ్ బెల్ మోగడం, వీల్ చైర్, వేస్ట్ మేనేజ్మెంట్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయుడు గంగాధర్, ఎంఇఒ ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, స్థానిక హెచ్‌ఎం రాజేశ్వరి, ఎస్‌ఎంసి ఛైర్‌పర్సన్ గంగాభవాని, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.



తాళ్లరేవులో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంపిపి

సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విశాఖపట్నంలో ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకూ జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం రూరల్ ఇంద్రపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను పంచాయతీ వర్కర్స్ యూనియన్ రూరల్ మండల అధ్యక్షులు వీరభద్రం, సీనియర్ నాయకులు వాసంశెట్టి చంద్రరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారిగా సిఐటియు జాతీయ మహాసభ జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి నెలలో జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జనవరి 4న విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్‌లో జరిగే బహిరంగ సభలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మురుమల సత్యనారాయణ, మేడిశెట్టి శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, పిల్లి త్రిమూర్తులు, మేడిశెట్టి రాజు, కస్తూరి శీను, గీసాల నూకరాజు, ఏల్చూరి శివ, మేడిశెట్టి క్రాంతి, బొచ్చ మారేష్, పంపన శివరామకృష్ణ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మోడల్ టెస్ట్ పేపర్ల అందజేత

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో పదో తరగతి విద్యార్థులకు రూ.40 వేల విలువ చేసే మోడల్ టెస్ట్ బుక్స్‌ను తుని, పిఠాపురం ఏరియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపల్లి చిన్నబాబి బహుకరించారు. బుధవారం పట్టణం లోని జడ్‌పి బాలురు, బాలికలకు చెందిన ఉన్నత పాఠశాలలు, చేబ్రోలు హైస్కూల్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చినబాబీ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ మోడల్ టెస్ట్ పేపర్ల బుక్స్‌ను అందించినట్లు తెలిపారు. ఎంఇఒలు వెన్న శ్రీనివాస్, బి శివప్రసాద్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా చినబాబీ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను బహుకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, సిహెచ్.సూర్యప్రకాష్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చేతులూరి సూరిబాబు, యుటిఎఫ్ నాయకులు ఎంవి.సత్యనారాయణ, జి.ఈశ్వరరావు, డి.వీరస్వామి, దాడి పద్మనాభం, ఎస్‌కె సాజిదా, దాసం గోవిందరాజు, రాజేంద్రప్రసాద్, అరుణశ్రీ పాల్గొన్నారు.



మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

19న ఉద్యోగుల పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 19వ తేదీన కలెక్టరేట్‌లో ఉద్యోగుల పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల 3వ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఉద్యోగుల సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 3.45 నిమిషాలకు నిర్వహించే పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విత్తన శుద్ధితో ప్రయోజనాలు

ప్రజాశక్తి - సామర్లకోట

విత్తన శుద్ధి సక్రమంగా చేపట్టి నారుమడులు వేస్తే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ సూచించారు. బుధవారం మండలంలోని గొంచాల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సాగు సమయంలో ప్రతి రైతు తప్పనిసరిగా సుడోమోనాస్ ద్వారా విత్తన శుద్ధి చేయాలని సూచించారు. కేజీ విత్తనాలకు 8 గ్రాముల మోతాదులో సుడోమోనాస్ వినియోగించాలని అన్నారు. యూరియా అధిక వినియోగం వల్ల పంటల్లో పురుగులు, తెగుళ్ల సమస్య పెరుగుతుందని, అందువల్ల యూరియా వినియోగాన్ని నియంత్రిత స్థాయిలోనే చేయాలని రైతులకు సూచించారు. యూరియా కార్డులను సొసైటీలు, ఆర్‌ఎస్‌కెల వద్ద రైతులకు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పేర్నిడి వెంకటరాయుడు, నాయకుడు ముమ్మిడి సూరిబాబు, రైతులు రాము, అమ్మిరాజు, సామన సుబ్బారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు, విఎఎ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఎఒ

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనం వద్ద బుధవారం పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు తోలేటి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మల్లేశ్వరరావు మాట్లాడారు. అనంతరం సీనియర్ పెన్షనర్స్‌ను సత్కరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జెవిఆర్.రమేష్, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ప్రణీత్, పాల్గొన్నారు. **కాకినాడ** స్థానిక పెన్షనర్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ గణేష్‌బాబు మాట్లాడారు. అనంతరం సీనియర్ పెన్షన్‌దారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎటిఒ అపర్ణ, సంఘ కోశాధికారి శేషగిరి, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్రావు, సరోజిని, జగపతి రాజు, సుబ్బారావు, ఇబ్రహీం, స్వాతి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక పెన్షనర్స్ భవనంలో పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్యామ్ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ట్రెజరీ అధికారి ఎస్.ఈశ్వరి చేతుల మీదుగా సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జి.గోవిందరావు, కోశాధికారి డి.రామ్మోహనరావు సంఘానికి సంబంధించిన నివేదికను సమర్పించారు.



పెద్దాపురంలో పెన్షనర్ల దినోత్సవంలో పెన్షనర్లు

పలువురికి రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో పలువురికి రగ్గులు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని రామన్నపాలెం, పొన్నాడ, మూలపేట, ఉప్పాడ గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ ధర్మ వైద్యశాల ఇన్‌ఛార్జ్ స్వామి లోకమాయానంద చేతుల మీదుగా రగ్గులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు మహాలక్ష్మి, సోమశేఖర్, అప్పారావు, గుండారపు శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, సరోజినీ, సిబ్బంది పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. బుధవారం మండలానికి చెందిన ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన ఈగల సత్తిబాబు, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పి.వరహాలు డిప్యూటీ కలెక్టర్ భారతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌టి కులస్తులకు కుల ధృవీకరణ పత్రం ఇవ్వకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కుల ధృవీకరణ పత్రం ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వం మంజూరు చేసే పింఛన్, రాయితీ రుణాలు, ఇతర సంక్షేమ పథకాలకు అనర్హులు అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి కుల ధృవీకరణ పత్రాలను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపల్ చల్లా లోవరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్యానల్ లీగల్ అడ్వకేట్ మడికి రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ నూతలపాటి అప్పలకొండ, ఎన్.శ్రీహర్ష, ఎం.మాధవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



క్రీడలతో విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్

ప్రజాశక్తి - కాకినాడ

క్రీడలతో విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందని డిఎస్‌పి వై.శ్రీకాంత్ అన్నారు. రాజమహేంద్రవరం రైల్వే క్వార్టర్స్ మైదానంలో గుంటూరు ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 27వ క్రీడా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ మీట్‌ను డిఎస్‌పి ప్రారంభించారు. అనంతరం శాంతికి ప్రతిరూపంగా పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో శారీరక బలాన్ని, మానసిక ఉత్తేజాన్ని పెంచుతాయని అన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని కోరారు. క్రీడలకు ప్రభుత్వాలు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల రీజనల్ ఇన్‌ఛార్జ్ తోట ఉమారాణి మాట్లాడుతూ ప్రతీ ఏడాది క్రీడోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థులలో దాగివున్న క్రీడా స్ఫూర్తిని, పటిమను వెలికి తీస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ఛైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి మాట్లాడుతూ విద్యాబోధనతో పాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి, జోసెఫ్ రెడ్డి అభినందనలు తెలిపారు. క్రీడోత్సవాలకు రాజమహేంద్రవరం బ్రాంచ్ ప్రిన్సిపల్ జి.నాగమణి స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఒలింపియాడ్ ప్రిన్సిపల్ పి.ఉషామాధురి, కాకినాడ ప్రిన్సిపల్ టిఎల్.వేణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



బెలూన్లను ఎగురవేస్తున్న డిఎస్‌పి, సంస్థ ప్రతినిధులు



రక్తదానం చేస్తున్న కళాశాల ఉపాధ్యాయులు

కోరంగి ఫార్మసీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరింగ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఫార్మసీ కళాశాలలో ఒకేసారి ఈ రక్త దాన శిబిరాలు క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకు సిబ్బంది, క్లబ్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానం చేసిన సిబ్బంది, విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జోసఫ్ బెన్నీ, సుబ్బారావు, సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ గుండు సీత, ప్రిన్సిపల్ సువర్ణజ్యోతి, దున్నా శ్రీకాంత్, ఎఒ నాగరత్నమాల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐదుగురికి రూ.50 వేల జరిమానా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని కాకినాడ ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జి ఎదుట పోలీసులు హాజరుపర్చారు. వారిలో ఐదుగురికి రూ.10 వేలు చొప్పున రూ.50 వేలు జరిమానా విధించగా, మరో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్షను విధించారని ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ముందస్తుగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ నేతలపై కేసుల నమోదు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి బస్టాండ్ సమీపంలో బుధవారం నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, గడ్డి బొమ్మను తగుల బెట్టి ఇబ్బందులు సృష్టించడంతో కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాకర్ల హరిబాబు, వెలగా రామకృష్ణ, మట్టపర్తి రామ్మోహన్, గన్నిన రామా నాయుడు, సుంకర సత్యనారాయణ, జ్యేష్ఠ సతీష్, మార్టిల్ లూథర్ తదితరులుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యనమదల యేసు అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధితుడు యేసు పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది పొడవునా పశువుల మేత కోసం ఎంతో శ్రమించి సిద్ధం చేసుకున్న గడ్డి కట్టలు కాలిపోవడంతో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు. దీనిపై సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

శానిటేషన్‌ను మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - కడియం

పంచాయతీ పరిధిలో శానిటేషన్ మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన వేమగిరి పంచాయతీ పర్యటించారు. తొలుత పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో చెత్త పేరుకుపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీల్లో మురుగు పారేలా ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజలతో చర్చించారు. ప్రజల విజ్ఞప్తి మేరకు గ్రామంలో నూతన రహదారి, డ్రెయిన్ నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు.



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెరవలి

మండల వనరుల కేంద్రంలో పదో తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి నూతన మోడల్ టెస్ట్ పేపర్స్ బుక్స్‌ను మండల విద్యాశాఖ అధికారులు బిబిఎస్.స్వరూప్, షేక్ సూర్జాన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి స్వరూప్ మాట్లాడుతూ ఇది పదోతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి.వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి తారా కృష్ణ, అధ్యక్షులు పి.నరేంద్రబాబు, అసోసియేట్ అధ్యక్షులు వి.రాధిక కార్యదర్శులు వి.శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కె.మహేష్, ఇఎస్.చక్రవర్తి జిల్లా కౌన్సిలర్ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాగల్లు

ఊనగట్ల సొసైటీ రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. చాగల్లు మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన దీన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, ఊనగట్ల సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, చాగల్లు గ్రామ అధ్యక్షులు దొంగ రామకృష్ణ, వై.అబ్బులు, తాళ్లూరి ప్రసాద్, ఎంపిటిసి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని మల్లవరంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో గృహాలను కోల్పోయిన ఇమ్మన గంగరాజు, ఎం.పెదకాపు, వై.వీర్రాజు, వై.వెంకటరమణ, కె.నూకరత్నం కుటుంబాలను ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ బుధవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షల వరూ ఆస్తినష్టం జరిగిందని బాధితులు ఆయనకు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో సేనాపతి త్రిమూర్తులు, గోకాడ చిట్టిబాబు, కళ్యాణ్, పల్లెల కొండలు, అల్లం వెంకన్న, రమణ, వైసిపి జగ్గంపేట అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేపట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పిఠాపురం

గొల్లప్రోలు మండలంలో ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.గోపిచంద్ అన్నారు. బుధవారం మండలంలోని చేబ్రోలు, దుర్గాడ, వన్నెపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధి పనులు, చెరువు గట్లు పటిష్టత, వాకింగ్ ట్రాక్‌లు, పార్కులో మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ వసంతమాధవి, ఎంపిడిఒ సెలెట్‌రాజు, ఎపిఒ గంగాభవాని, నీటి సంఘం అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు, ఎఫ్‌కె.పాలెం, రాపర్తి గ్రామాల్లోనూ ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.60 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు గోపిచంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.స్వప్న, ఎపిఒ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలంలో పర్యటిస్తున్న ఉపాధి హామీ అధికారులు

ఉపాధి చట్టం పేరు మార్పుపై 22న నిరసన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. బుధవారం రూరల్ మండలం తిమ్మాపురం, నేమం, పండూరు గ్రామాల్లో ఉపాధి చట్టం పేరు మార్పుపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వరయంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తల లేని మొండెంగా మారుతుందని అన్నారు. ఉపాధి హామీ చట్టంలోని 'హామీ' అనే పదాన్ని తొలగించడం ద్వారా ఈ చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. పనిదినాలు 125 రోజులకు పెంచుతున్నట్లు చెప్పి, 60 రోజులు పని నిషేధం విధించారని విమర్శించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు తోకల ప్రసాద్, నక్క శ్రీనువాస్‌రావు, అప్పలరాజు, పప్పు ఆదినారాయణ, సరస్వతి, మోహన్, వీరబాబు, చిట్టిమ్మ పాల్గొన్నారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న తాటిపాక మధు

నూనె గింజ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామంలో నూనె గింజల పంటపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పెద్దాపురం ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి మాట్లాడుతూ రైతులు నూనె గింజల పంటపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ పంటలు వేసుకునేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. నువ్వు పంటలో చీడపీడల నివారణ వ్యాధులపై పెద్దాపురం ఏరువాక సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామశర్మ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ పి.సూర్యచంద్రరావు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఎడి స్వాతి

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి - కరప

జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు డిఇఒ పి.రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని వేలంగి, నడకుదురు మోడల్ స్కూల్స్‌ను ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థుల స్థితిగతులను ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతికి చెందిన విద్యార్థులకు 100 రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తద్వారా నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెబి.కృష్ణవేణి, సిఆర్‌ఎంటిలు పి.సత్యనారాయణ, వై.నాగలక్ష్మికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కడియం

మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం శంకుస్థాపనలు చేవారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కడియం మండలానికి సంబంధించి, పంచాయతీ రహదారుల అభివృద్ధికి రూ.8.50 కోట్లు మంజూరు చేశామన్నారు.కడియం మండల పరిధిలో మొత్తం రూ.10 కోట్ల విలువైన ఆర్ అండ్ బి పనులకు అనుమతి వచ్చిందన్నారు. కడియపు లంకలో పిహెచ్‌సి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.50 లక్షల నిధులు సమకూర్చే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి స్థల దాత అన్నందేవుల రామసూర్య సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులైన అన్నందేవుల గంగాధరం, పార్వతి, దినేష్ తదితరులను గోరంట్ల అభినందించారు. అనంతరం కడియపుసావరంలో పంచాయితీ నిధులతో నూతనంగా నిర్మించనున్న షాపులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్‌లు మారిశెట్టి పద్మావతి, చెక్కపల్లి మురళి, ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, నాయకులు వెలుగుబంటి నాని, గట్టి నరసయ్య, గట్టి సుబ్బారావు, పాతంశెట్టి రాంజీ, మార్గాని ఏడుకొండలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 5జి ఫోన్ల అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం సమకూర్చిన 5జి మొబైళ్లను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో 223 మంది అంగన్‌వాడీ టీచర్లకు, 8 మంది సూపర్‌వైజర్లకు, బిపిసికి మొత్తంగా 232 మొబైల్స్ అందించనున్నామని తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ వివరాలు, సేవల అమలు స్థితిని అంగన్‌వాడీ టీచర్లు నేరుగా నమోదు చేయొచ్చన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, సిడిపిఒ కె.నాగలక్ష్మి, ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, చాగల్లు గ్రామ అధ్యక్షులు దొంగ రామకృష్ణ , యంత్రప్రగడ అబ్బులు, తాళ్లూరి ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కడియం : అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లకు 5జి సెల్ ఫోన్లను ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం అందజేశారు. మండలంలోని కడియపులంక కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన గోరంట్ల వీటిని అందించి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరు, చిన్నారుల స్థితిగతులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియపర్చేందుకు మొబైల్స్ ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. కడియం మండలానికి 82 సెల్ ఫోన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఈనెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియోను జయప్రదం చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ వీరన్న సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పంచాయతీ, సచివాలయ, వైద్య సిబ్బందికి ఒకరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి : దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పల్స్ పోలియోపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు మండల పరిషత్ అధ్యక్షులు కె.వి.కె. దుర్గారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్యులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఐదేళ్లలోపు 9,450 మంది పిల్లలను గుర్తించామన్నారు. మొత్తం 67 పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగార్జునరావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, వైద్యాధికారులు బి.మౌనిక, బి.ప్రశాంత్, డి.సంజీవ్, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం కోసం వినతి

ప్రజాశక్తి-కడియం

మండలంలో కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని పలువురు కాపు నాయకులు ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కోరారు. బుధవారం కడియపులంకలో పిహెచ్‌సి శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా వారు ఎంఎల్ఎను కలిశారు. పిహెచ్‌సి నిర్మిస్తున్న స్థలాన్ని దాత కాపు కళ్యాణ మండప నిర్మాణానికి ఇచ్చారని, అయితే గ్రామ పెద్దలు, ప్రజల కోరిక మేరకు ఆ స్థలాన్ని పిహెచ్‌సికి కేటాయించామన్నారు. ఈ నేపథ్యంలో కళ్యాణమండపానికి సహకరించాలని మండల కాపు ఐక్యవేదిక నాయకులు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో విన్నవించారు. దీనికి ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. స్థలాన్ని చూపితే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఎంపిపి ప్రసాద్ కలగజేసుకుని కడియంలో మండపం నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గట్టి సుబ్బారావు, గెద్దం శివ, మల్లు శివ, పుల్లా రామన్న, బొర్సు సుబ్రహ్మణ్యం కాపు ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ పేరు తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి-కొవ్వూరు

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగిస్తూ ఎన్‌డిఎ ప్రభుత్వం కొత్త చట్టం చేయడం దుర్మార్గమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎండి పసివుల్లా బేగ్ అన్నారు. బుధవారం కాపవరంలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌ఇజిఎస్ పథకంలో గాంధీ పేరు కొనసాగించాలని నినదించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళుల ర్పించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం నిరంకుశత్వ పాలన విడనాడాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్‌డి రఫీఉల్లాబేగ్, ఎఐసిసి సభ్యులు అమర్హహ బేగ్ మహ్మద్, రాజమండ్రి పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు సాకా పుల్లారావు, చాగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టా సుబ్బారావు, చాగల్లు గ్రామ అధ్యక్షులు మీసాల సత్యనారాయణ,జొన్నకూటి రవికుమార్ పాల్గొన్నారు.

పంట అవశేషాలు తగల బెట్టరాదు

ఉండ్రాజవరం: వరి పంట అవశేషాలు తగలబెట్ట కూడదని మండల రైతులకు వ్యవసాయ అధికారి బి.రాజారావు సూచించారు. బుధవారం మండలంలోని వేలివెన్ను, దమ్మెన్ను గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన ఏర్పాటుచేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా భూమిలోని సూక్ష్మజీవులు నష్టపోవడంతో పాటు భూసారం తగ్గుందన్నారు. వాతావరణ కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దాని బదులు నారుమడి దున్నే సమయంలోనే పొలాన్ని దున్ని ఎకరాకు 100 నుంచి 150 కేజీలు సింగల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువు వేయాలన్నారు. తద్వారా వరి నాట్లు వేసే సమయానికి పూర్తిగా కుళ్ళి, మంచి ఎరువుగా తయారవుతుందన్నారు.

ఫజులుల్లా ఖాన్-షేక్ మదీనా పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుకు స్వాతంత్ర్య పోరాటంలో అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్-షేక్ మదీనాలపై సయ్యద్ నజీర్ అహ్మద్ రచించిన పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోషుల కృష్ణబాబు అధ్యక్షతన పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అల్లూరి సీతారామారాజుకు తుపాకీ పేల్చడంలో శిక్షణ ఇచ్చిన షేక్ మదీనా పెద్దాపురం వాసి కావడం గర్వకారణమన్నారు. అనేక పోరాటాల చరిత్రలో పెద్దాపురం అంతర్భాంగంగా ఉందన్నారు. ఈ సభలో పెద్దాపురం చరిత్ర పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ, ముక్తార్ ఆలీ, చల్లా విశ్వనాథం, బుద్దా శ్రీనివాస్, పెద్దిరెడ్డి నరేష్, లక్ష్మణ్ దివాకర్, కొత్త శివ, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో పాలచర్ల గాడ్స్ గ్రేస్ గాస్పల్ మినిస్ట్రీస్ అధినేత గ్రేస్ విక్టర్ మాట్లాడారు. సిజిఎం గౌరవాధ్యక్షులు నంగిన సత్యానందం, శాంత కుమారి దంపతులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వంకా జాన్, కాసా అభిషేక్, జయకుమార్, ఎలిసా, శాంతకుమారి, ప్రేమలత, విశాల, సుజాత, రూత్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో యానం, తాళ్లరేవు పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫెలోషిప్ అధ్యక్షులు, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు పోప్ ఫౌండేషన్ డైరెక్టర్ బిషప్ మాసా ఇమ్మానుయేల్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం సామ్యూల్‌సాగర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ దొమ్మేటి వసంతరావు, బిషప్ జోసెఫ్ బెన్నీ, శీరం ఐజాక్, జాషువా గిరి, మాసా జాన్, స్టీవెన్ బాబు, సాల్మన్ రాజు పాల్గొన్నారు.



తాళ్లరేవులో జడ్‌పిటిసి సాగర్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు



పిహెచ్‌డిని అందుకుంటున్న వెంకటేశ్వరరావు

పిహెచ్‌డి అందుకున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక పిఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు తాతపూడి వెంకటేశ్వరరావు నన్నయ యూనివర్శిటీ నుంచి పిహెచ్‌డిని అందుకున్నారు. యూనివర్శిటీ విసి ఆచార్య ప్రసన్నశ్రీ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్ కళాశాల నుంచి మొట్టమొదటి పిహెచ్‌డిని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిఎఎం జూప్లాంక్టాన్ అనే అంశంపై పరిశోదన చేసినట్లు ఆయన తెలిపారు. జువాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పిహెచ్‌డిని పూర్తి చేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ ఎన్.శ్రీనివాస్, తదితరులు వెంకటేశ్వరరావును అభినందించారు.

కమిటీలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో వికలాంగ కమిటీలను ఏర్పాటు చేయాలని యువస్పందన స్వచ్ఛంద వికలాంగ సంఘం నాయకుడు బివివి.సత్యనారాయణ కోరారు. బుధవారం మండలంలోని చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామ, మండల స్థాయి వికలాంగుల కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు, 2016 జిఒను అమలు చేసేందుకు వికలాంగులను భాగస్వాములు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉలవలశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ పెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డివైఇఒ ఈరంకి ప్రభాకర శర్మ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు ఈ ప్రదర్శలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలుగులోకి వస్తాయన్నారు. తద్వారా సమాజ అభివృద్ధికి దోహదం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శంకరం, హెచ్‌ఎంలు రవి, కెనడీ, కూటమి నాయకులు శాస్త్రి, నాగు, సత్తిబాబు, సతీష్, ఆరీఫ్, వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.